క్లుప్తంగా

ఉండికి నూతన ఎంఈవోలు


మండల నూతన ఎంఈవోలు జ్యోతి, వినాయకుడు

ఉండి: మండల నూతన విద్యాశాఖ అధికారులుగా బొల్లిపో జ్యోతి, బొక్కా వినాయకుడు నియామకమయ్యారు. ఉండి మండలం యండగండి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయనిగా విధులు నిర్వర్తిస్తున్న జ్యోతి ఇటీవల జరిగిన నియామకాల ద్వారా మండల ప్రథమ విద్యాశాఖాధికారిగా పూర్తి అదనపు బాధ్యతలను ఆమె అప్పగించారు. అలాగే వీరవాసరం మండల విద్యాశాఖాధికారిగా విధులు నిర్వర్తిస్తున్న వినాయకుడిని మండల రెండవ విద్యాశాఖాధికారిగా నియమించినట్లు వారు తెలిపారు. గతంలో ఉండి మండల విద్యాశాఖాధికారిగా ఆకివీడు మండల ఎంఈవోగా రవీంద్ర విధులు నిర్వర్తించేవారు. ఉపాధ్యాయులందరినీ సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ విద్యా విధానంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువస్తున్న మార్పులకు నుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్ది ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామని నూతన ఎంఈవోలు తెలిపారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి


భీమవరంలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని రాష్ట్ర చేతివృత్తుల సంఘం జిల్లా నాయకుడు మల్లుల సీతారామ్‌ప్రసాద్ అన్నారు. ఈనెల 21న రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర సదస్సు అనంతపురంలో జరగనున్న సందర్భంగా బుధవారం పట్టణంలోని గునుపూడి రజకులచెరువు వద్ద కరపత్రాలు పంపిణీ చేసి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజక వృత్తిదారులు రజకుల అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో షేక్ చాంద్ బాషా, లక్ష్మి, వెంకటేశ్వరరావు, రామారావు, సుబ్బయ్య ,కె శ్రీను, పరమేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం


ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు నగదు పురస్కారాలు అందిస్తున్న ఆర్డీఓ రాజు

సాక్షి, భీమవరం: ఉన్నత విద్యనభ్యసించే పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడంలో దాతలు అందిస్తున్న సహకారం ప్రశంసనీయమని భీమవరం ఆర్డీఓ దాసి రాజు అన్నారు. భీమవరంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన ఆరుగురు విద్యార్థులకు శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో బుధవారం ఆర్థికసహాయం అందించారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన ఎ.నందిని, కె.కీర్తిశ్రీరంగ శివాని, టి.మేఘన, కె.కృష్ణప్రియ, వి.రమాదేవి, కళ్యాణిలకు ఒక్కొక్కరికి రూ.3 వేలు అందించారు. నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ తుమ్మలపల్లి మంగరాజు విశ్రాంతి భవన్ ట్రస్ట్ సహకారంతో నగదు పురస్కరాలు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ వై.రవికుమార్, ట్రస్ట్ నిర్వాహకులు తుమ్మలపల్లి నాగ శివవెంకట సత్య కృష్ణమూర్తి, తుమ్మలపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

న్యాయవాదులపై దాడికి నిరసన


డీఎన్నార్ లా కళాశాల వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

సాక్షి, భీమవరం: న్యాయవాదులపై దాడులను నిరసిస్తూ భీమవరం డీఎన్నార్ లా కళాశాల విద్యార్థులు గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు మాట్లాడుతూ అవనిగడ్డలో న్యాయవాది ఎం.శ్రీనివాస రావుపై దాడిచేసి హత్యయత్నానికి పాల్పడడం దారుణమన్నారు. దాడి చేసిన వారిని తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. వీర్రాజు,అశోక్‌చౌదరి, పి.తేజ్, టి.రవి పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

వీరవాసరం: ఉద్యోగ నిర్వహణలో బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తే పేరు ప్రఖ్యాతలు వాటి అంతటవే వస్తాయని గ్రామ సర్పంచ్ గెద్దం భారతీ తెలిపారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల రాయకుదురు 2 లోని విద్యార్థులకు మంగళవారం నోట్ బుక్స్, పెన్సిల్లు, పెన్నులు, ఇతర విద్యాసామాగ్రిని పంపిణీ చేశారు. పాఠశాల నుండి బదిలీపై వెళుతున్న దేవి రెడ్డి పుల్లారావును ఘనంగా సత్కరించారు. విద్యా కమిటీ చైర్మన్ తోట పెద్దిరాజు, హెచ్‌ఎం రామచంద్రరాజు, గెద్దం భాస్కరరావు పాల్గొన్నారు.

అవస్థలు తీర్చిన సచివాలయ వ్యవస్థ

- గ్రామ స్థాయిలో సమస్యల పరిష్కారం
- 536 రకాల సేవలు అందుబాటులోకి
- 15నుంచి 72గంటల్లో పొందే అవకాశం


గొరగనమూడి సచివాలయంలో ప్రజలకు సేవలందిస్తున్న సిబ్బంది

పాలకోడేరు: గ్రామీణ సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. గత తెలుగు దేశం పార్టీ ప్రభుత్వ పాలనలో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూపొందించిన సచివాలయ వ్యవస్థ నాటి అవస్థలు, సమస్యలన్నింటినీ తీర్చుతూ ముందుకు సాగుతోంది. సచివాలయ వ్యవస్థ ద్వారా రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించారు. ఈ వ్యవస్థ ద్వారా ప్రజలకు ప్రజలకు విశేషమైన సేవలందిస్తోంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు సమన్వయం చేస్తూ సమస్త సేవలను వీటి ద్వారా ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. రెండు వేల మంది జనాబాకు ఒక సచివాలయం. 50 కుటుంబాలకు ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు సేవలందిస్తున్నారు. సచివాలయాల ద్వారా 536 రకాల సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ సేవలను 15 నిమషాల నుంచి 72గంటల్లో పొందే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మారుమూల ప్రాంతాల్లో సైతం సచివాలయ సేవలను పొందే విధంగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

ప్రజలకు చేరువగా పాలన

సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో ప్రభుత్వం ప్రజలకు చేరువైంది. ఉండి నియోజకవర్గంలో పాలకోడేరు, ఆకివీడు, కాళ్ల, ఉండి మండల్లాల్లోని 72 గ్రామాల్లో 75 సచివాలయాలు నెలకొల్పగా750 మంది ఉద్యోగులు ప్రతిరోజూ సేవలు అందిస్తున్నారు. ఒక్కో సచివాలయంలో 10నుంచి 11మంది ఉద్యోగులను నియమించారు. అలాగే సచివాలయానికి ఒక్కొక్క రైతు భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేసి అగ్రికల్చర్ అసిస్టెంట్ ఉద్యోగులను ప్రజల చెంతకే తీసుకువచ్చారు.

మా గ్రామంలోనే భూమి సేవలు



గత ప్రభుత్వ పాలనలో గ్రామస్థాయిలో సేవలు అందేవి కావు. ధ్రువీకరణ పత్రాల కోసం మండల కేంద్రం వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. దరఖాస్తు చేసుకున్న వెంటనే ధ్రువీకరణ పత్రాలు సచివాలయంలోనే ఇస్తున్నారు

బొడ్డే చంటమ్మ మోగల్లు లబ్ధిదారురాలు

అధికారుల సేవలు బాగున్నాయి



ప్రస్తుత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన సచివాలయవ్యవస్థ వల్ల సమయం, డబ్బు, ఆదా అయింది. పనులు త్వరగా పూర్తి చేయడంతో ఆనందంగా ఉంది. చేయూతకు అవసరమయ్యే కుల ధ్రువీకరణ పత్రం కోసం వలంటీర్ దరఖాస్తు చేసుకున్న గంటల వ్యవధిలో సర్టిఫికెట్లు అందించారు.

ఎం సంపత, లబ్ధిదారుడు పాలకోడేరు

గంటల వ్యవధిలో సర్టిఫికెట్



గ్రామ సచివాలయాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ఏ సర్టిఫికేట్ కావాలన్నా గంటల వ్యవధిలో ఇస్తున్నారు. నేను సచివాలయంలో సర్టిఫికేట్‌కు దరఖాస్తు చేసుకున్న అదేరోజు నాకు సర్టికికేట్ ఇచ్చారు. గతంలో ఇలా ఉండేది కాదు. మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ ఇబ్బంది లేదు. నేరుగా మా గ్రామంలోనే అన్ని సేవలు అందుబాటులోకి వచ్చాయి.

కొల్లి సుశీల, లబ్ధిదారురాలు మోగల్లు

క్రమ శిక్షణతో విద్యనభ్యసించాలి

ఆకివీడు: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని కైకలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల గణిత అధ్యాపకురాలు సీ.గౌసియా సుల్తాన్ చౌదరి తెలిపారు. మండలంలోని దుంపగడప గ్రామంలో వీవీ.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం అతిథి అధ్యాపక గౌరవ ఉపన్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుల్తాన్ చౌదరి అప్లికేషన్ ఆఫ్ లీనియర్ ఆల్‌జీబ్రా సబ్జెక్ట్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆన్‌లైన్‌లో పలు వెబ్ సైట్‌ల గురించి వివరించారు. విద్యార్థులు ఆల్‌జీబ్రా సబ్జెక్టుపై అవగాహన పెంచుకోవాలన్నారు. గణిత శాస్త్ర అధ్యాపకులు హరనాథ్ మాట్లాడుతూ బీఎస్సీ ద్వితియ సంవత్సరంలో ఒక సబ్జెక్టుగా లీనియర్ ఆల్‌జీబ్రా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కే.సుజాత, పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

వీరవాసరం: మండలంలోని సీసీ రోడ్డు నిర్మాణ పనులను సక్రమంగా నిర్వహించాలని రాయకుదురు సర్పంచ్ గెద్దం భారతి తెలిపారు. రాయకుదురు శివారు జగన్నాథరావుపేటలోని సీసీ రహదారి నిర్మాణ పనులను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక గ్రామంలో సుమారు 20 కోట్లకు పైగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఆమె వెంట ఇంజినీరింగ్ అసిస్టెంట్ సాదిక్, సాయి, సుబ్రహ్మణ్యం, గెద్దం భాస్కర్ రావు తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి


మండలపరిషత్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్


మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం: మండలంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం జరుగుతున్న పనులను వేగవంతం చేయడంతో పాటు అవసరమైన మరికొన్ని పనులకు నిధుల మంజూరుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎంపీడీఓ కె వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీపీ ట్యాంక్ పనులు పూర్తి చేయాలి

టిడ్కో గృహాలలో నివసించే ప్రజల వాడకపు నీటిని శుద్ధి చేసే ఎస్‌టీపీ ట్యాంకు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆదేశించారు. బుధవారం రాత్రి ఆయన క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో మాట్లాడారు. ప్రస్తుతం పనులు ఎంతవరకు వచ్చాయనే దానిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో మున్సిపల్ ఎంఈ త్రినాధరావు, డీఈ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సాగి రామకృష్ణంరాజు సేవలు స్ఫూర్తిదాయకం


ఎస్‌ఆర్‌కేఆర్ కళాశాలలో రామకృష్ణంరాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: సామాజికసేవతో పాటు విద్యారంగం అభివృద్ధికి కృషి చేసిన దివంగత సాగి రామకృష్ణంరాజు నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమని రాష్ట్ర శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు అన్నారు. భీమవరం ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల, ప్రసాద్ అండ్ కో కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో బుధవారం రామకృష్ణంరాజు 90వ జయంతిని కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మోషేనురాజు మాట్లాడారు. చినఅమిరం వంటి చిన్న గ్రామంలో 43 ఏళ్ల క్రితం ఇంజినీరింగ్ కళాశాల స్థాపించి దేశానికి ఆదర్శవంతమైన విద్యాలయంగా తీర్చిదిద్దడంలో ఆయన కృషి ప్రశంసనీయమన్నారు. సెంచూరియన్ యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ జీఎస్‌ఎన్ రాజు మాట్లాడుతూ నాగార్జునసాగర్ ప్రాజెక్టు కాంట్రాక్టర్‌గా దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చేతుల మీదగా మెటల్ కింగ్ అవార్డు పొందిన రామకృష్ణంరాజు విద్య రంగానికి చేసిన సేవలు మరువరానివన్నారు. ముందుగా రామకృష్ణంరాజు విగ్రహానికి నివాళులర్పించిన మోషేనురాజు దివ్యాంగులకు ట్రై సైకిల్స్ పంపిణీ చేసి, కళాశాలకు వివిధ రంగాలలో సేవలందించిన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు సాగి ప్రసాదరాజు, సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ, క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, కళాశాల గౌరవ చైర్మన్ పి.కృష్ణంరాజు, ఉపాధ్యక్షుడు గోకరాజు రామరాజు, సాగి విఠల్‌రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆవు మృతి


రోడ్డుపై మృతి చెందిన ఆవు

ఆకివీడు: స్థానిక జాతీయ రహదారిపై గుమ్ములూరు సెంటర్ వద్ద బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆవు మృతి చెందింది. తల్లి మరణంతో తల్లడిల్లిన ఆవు దూడ మృతదేహం వద్దే పుట్టెడు దుఖంతో ఉండిపోయింది. తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. వర్షంకు ఆవులు, ఆబోతులు రోడ్డుపై నుంచి ప్రక్కకు వెళ్లుతుండగా ఈ సంఘటన జరిగి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఆవు తలపై నుంచి వాహనం వెళ్లడంతో తలకి తీవ్ర గాయమైంది. మృతి చెందిన ఆవు వద్ద పిల్ల దూడ ఉండటంతో స్థానికులు, పలువురు చలించిపోయారు. తల్లి ప్రేమ పట్ల ఆశ్చర్యానికి గురయ్యారు. అనంతరం ఆవును పంచాయతీ పారిశుధ్య కార్మికులు అక్కడి నుంచి శ్మశానానికి తరలించి, పూడ్చిపెట్టినట్లు స్థానికులు తెలిపారు.

మెప్మా అధ్యక్షురాలిగా మోరా జ్యోతి రెడ్డి ఎన్నిక


స్థానిక నగర పంచాయతీ ఆవరణలో ఎన్నికైన పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ(మెప్మా) కమిటీని అభినందిస్తున్న ఐబీ అధికారిణి గ్రంధి పార్వతి

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ(మెప్మా) అధ్యక్షురాలిగా మోరా జ్యోతి రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం మెప్మా ఆర్‌సీలు 18 మందితో సమావేశం జరిగింది. జిల్లా ఐబీ అధికారిణి గ్రంధి పార్వతి సమక్షంలో ఎన్నికను నిర్వహించగా అధ్యక్షురాలిగా జ్యోతి రెడ్డితో పాటు కార్యదర్శిగా కె.రంగమ్మ, ఉపాధ్యక్షురాలిగా కె.రత్నకుమారి, జాయింట్ సెక్రటరిగా టి.ఎస్. దుర్గా భవానీ, కోశాధికారిగా కే.దయామణిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం మెప్మా కమిటీ అధ్యక్షురాలు జ్యోతిరెడ్డితో పాటు కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కమిటీని చైర్‌పర్సన్ అభినందించారు.

బాలుడికి ఆర్థిక సాయం


సీఐ నాగప్రసాద్ చేతుల మీదుగా నగదును అందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: కిడ్నీ సమస్యతో బాధపడుతున్న బాలుడి చికిత్స కోసం రాయలం విశ్వబ్రాహ్మణ వెల్ఫేర్ యూత్ ఆధ్వర్యంలో రూ. 1.28 లక్షలు ఆర్థిక సహాయాన్ని భీమవరం రూరల్ సీఐ నాగ ప్రసాద్ చేతులు మీదుగా అందజేశారు. పట్టణంలోని 25వ వార్డు బ్యాంక్ కాలనీలో నివసిస్తున్న కలిశెట్టి బ్రహ్మయ్య బంగారపు వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన కుమారుడు హేమంత్ కిడ్నీ సమస్యతో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం రాయలం విశ్వబ్రాహ్మణ వెల్ఫేర్ యూత్ దృష్టికి రావడంతో మానవ తాధృకృథంతో విశ్వబ్రాహ్మణ సంఘం, విశ్వబ్రాహ్మణ వెల్ఫేర్ యూత్ ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. నగదు మొత్తాన్ని బుధవారం సీఐ నాగప్రసాద్ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందించారు. ఈ కార్యక్రమంలో కన్నబాబు, రాయలం విశ్వబ్రాహ్మణ సంఘం, విశ్వబ్రాహ్మణ వెల్ఫేర్ యూత్ నాయకులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే విద్యాభివృద్ధి

జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ


విద్యార్థులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఉండి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రభుత్వ విద్యావ్యవస్థకు మహర్దశ పట్టిందని ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పద్మశ్రీ అన్నారు. బుధవారం ఉండి జడ్పీ హైస్కూల్‌ను డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో వసతులు, మధ్యాహ్న భోజనం, మరుగుదొడ్లను పరిశీలించిన అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు.అనంతరం పాఠశాల ప్రహరీ నిర్మాణం కొరకు ఉపాధ్యాయులు ఇచ్చిన వినతిపత్రంపై ఆమె స్పందిస్తూ తప్పకుండా నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యావ్యస్థను నిర్వీర్యం చేసి ప్రైవేట్, కార్పొరేట్ విద్యకు కొమ్ముకాసాయని విమర్శించారు. నిరుపేదల అభివృద్ధి విద్యతోనే సాధ్యం అవుతుందని గమనించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి విద్యాభిద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ముఖ్యమంగా జగనన్న అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద కార్యక్రమం ద్వారా ఎంతోమంది విద్యార్థులను పాఠశాల బాట పట్టించారన్నారు. గతం కంటే ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులతో కళకళలాడుతున్నాయన్నారు.డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు మాట్లాడుతూ పేదవాడి దేవాలయం ప్రభుత్వ పాఠశాల అని దానిని మరింత ఉన్నతస్థాయికి తీసుకువెళ్లి ప్రభుత్వ విద్యలో అద్భుతాలు సాధించే దిశగా మరిన్ని కార్యక్రమాలు ముఖ్యమంత్రి చేపడుతున్నారని అన్నారు. నియోజకవర్గంలో అన్ని పాఠశాలలు అద్భుంతగా ఉన్నాయని విద్యార్థుల హాజరుశాతం చాలా బాగుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కమతం సౌజన్య, జడ్పీటీసీలు రణస్థుల కనకదుర్గ, యండగండి శ్రీను, రణస్తుల మహంకాళి, కమతం బెనర్జీ, స్కూల్ పేరెంట్‌కమిటీ చైర్మన్‌బొండాడ వీర్రాజు, బ్యాంక్ డైరెక్టర్ కరిమెరక శివనాగరాజు, గలివిల్లి ధనుంజయ, వైఎస్సార్‌సీపీ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికం


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు

భీమవరం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో కుల, మత, రాజకీయాలకు తావు లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చుతున్నామని ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు అన్నారు. భీమవరంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఉచితంగా 11 రకాల సర్టిఫికెట్లను అందిస్తున్నారన్నారు. యనమదుర్రు డ్రెయిన్‌పై 3 వంతెనకు అప్రోచ్‌లు నిర్మించేందుకు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ రూ.36 కోట్లు మంజూరు చేయించారని ఆ పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం అద్భుతమైన కార్యక్రమమని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల పశువైద్యాధికారి పి.పుండరీబాబు మాట్లాడుతూ పాడి పశువులు ఉన్నవారు కిసాన్ క్రెడిట్ కార్డులు పొందాలన్నారు. ఈ కార్డులు వల్ల గేదెకు రూ. 40 వేలు, ఆవుకు 30 వేలు బ్యాంకర్లు రుణాన్ని మంజూరు చేస్తారని నెలవారి వాయిదాల పద్ధతిలో చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎలక్ట్రికల్ ఏఈ నరసయ్య మాట్లాడుతూ భీమవరం మండలంలో గత మూడు నెలల్లో రూ. కోటి 5 లక్షల అభివృద్ధిపనులు జరిగాయన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు అరుణకుమారి, ధనలక్ష్మిలు మాట్లాడుతూ అవుట్ పేషెంట్లు ఆస్పత్రికి వచ్చేటప్పుడు గుర్తింపు కార్డులైన ఆధార్, డ్రైవింగ్ తదితర కార్డులు తీసుకువస్తే ఆ పేషెంట్ వివరాలు రిజిస్ట్రేషన్ చేస్తే దేశంలో ఎక్కడైనా ఆ పేషెంట్ రోగానికి సంబంధించి వివరాలు తెలుస్తాయని ఎక్కడైనా వైద్యం చేయించుకోవచ్చన్నారు. హౌసింగ్ ఏఈ శశిధర్ మాట్లాడుతూ మండలంలో 1782 గృహ నిర్మాణాలకుగాను 857 గృహ నిర్మాణాలు పూర్తయిన లబ్ధిదారులు ఇళ్లలో నివసిస్తున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వై. రవికుమార్, ఎంపీడీఓ కె.వెంకటలక్ష్మి, సర్పంచ్‌లు కోళ్ల బాలకృష్ణ, అరేటి వీరాస్వామి నాయుడు, చిల్లే వెంకటేష్,రామాని శివాజీ వర్మ, ఎంపీటీసీ సభ్యులు బొమ్మిడి కొండరాజు, తిరుమాని తులసీరావు, తేలి జోషఫ్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక అభివృద్ధే సీఎం జగన్ లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న పీవీఎల్

కాళ్ల: రాష్ట్రంలో మహిళల ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహారాజు తెలిపారు. కాళ్ల మండలం పెదఅమిరం పార్టీ కార్యాలయంలో బుధవారం ఆకివీడు పట్టణ సమాఖ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పీవీఎల్ మాట్లాడుతూ ఆకివీడు నగర పంచాయతీగా మారటంతో పట్టణ సమైఖ్య ఏర్పాటు చేశారన్నారు. ఆకివీడు పట్టణ సమాఖ్య అధ్యక్షురాలిగా వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకురాలు మోరా జ్యోతిరెడ్డితో పాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేయటం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పట్టణ సమైఖ్య అధ్యక్షురాలుగా ఎన్నికైన మొరా జ్యోతిరెడ్డిని అభినందించారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని మహిళలంతా ఆర్థికంగా ముందుకు సాగాలని కోరారు. పొదుపు సంఘాల ద్వారా ఎటువంటి అవినీతికి పాల్పడకుండా పనిచేయాలని హితవు పలికారు. ఈ సమావేశంలో పట్టణ సమాఖ్య అధ్యక్షురాలిగా ఎన్నికైన మోర జ్యోతి రెడ్డి మాట్లాడుతూ అందరి సహకారంతో ఆకివీడు పట్టణ సమాఖ్య సంఘాన్ని ముందుకు తీసుకెళ్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వేగేశ్న వెంకటరాజు, జామి శ్రీనివాస్, మెప్మా ఐబి జి పార్వతి, నానిబాబు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సార్వా సాగు


గొల్లగూడెంలో వేసిన ఆకుమడులు

మొగల్తూరు: మండలంలో సార్వా సాగు పనులు సాగుతున్నాయి. ప్రధాన కాలువలు సమయానికి వదిలేసినా ఇంకా శివారు ప్రాంతాలకు సాగు నీరు అందకపోవడం, వరుణుడు కూడా కరుణించకపోవడంతో వ్యవసాయ పనులు ప్రారంభం కాలేదు. అయితే గత కొద్ది రోజులుగా వర్షాలు పడుతుండటంతో చేలల్లో నీరు నిలవడంతో దుక్కులు దున్నే పనులు ప్రారంభించారు. అయితే మండలంలోని రామన్నపాలెం, శేరేపాలెం పంచాయతీ నవుదూరుగరువు, మొగల్తూరు, కేపీ పాలెం, పేరుపాలెం గ్రామాల్లో సార్వా సాగు చేపడుతుండగా, రామన్నపాలెం 2, మొగల్తూరు 2,3 సచివాలయాల పరిధిలో ముందుగా ఆకుమడులు వేసుకోవడంతో నాట్లు వేసుకునేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. మండలంలో సుమారు 1680 ఎకరాల్లో సార్వా సాగు చేపడతారని వ్యవసాయాధికారులు అంచనాలు వేయగా ఇప్పటివరుకు 150 ఎకరాల్లో ఆకుమడులు వేశారని భావిస్తున్నారు. ఎంటీయూ 1029,1064,1061,1318 రకాల విత్తనాలు వినియోగించాలని అధికారులు సూచిస్తున్నారు. రైతులకు అవసరమయ్యే సలహాలు సూచనలు అందించేందుకు రైతు భరోసా కేంద్రంలో అధికారులు సిద్ధంగా ఉన్నారని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ రహీమ్ సూచిస్తున్నారు.